క్లుప్తంగా

సకాలంలో రేషన్ పంపిణీకి చర్యలు



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

సంజామల: రేషన్ లబ్ధిదారులకు సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ అనిల్ కుమార్ అన్నారు. శనివారం సంజామల తహసీల్దార్ కార్యలయంలో మండలంలోని 32 రేషన్‌డీలర్లతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. జూన్ నెల నుంచి రేషన్‌డీలర్లే సరుకులు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి నిత్యవసర సరుకు ప్రజలకు చేరాలని ఆదేశించారు. ఎవరైనా అవకతవకలు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ తులసి కృష్ణ, విలేజ్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో కాటసాని

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ధనలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన అవుకు మండలం మంగంపేట గ్రామానికి చెందిన జెట్టి మద్దిలేటి, అంజనమ్మ దంపతుల కుమారుడు మధనగోపాల్ వివాహానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, బనగానపల్లె మండల కన్వీనర్ ఎస్. జనార్దన్‌రెడ్డి, ఈశ్వర్‌నాయక్, చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

బేతంచెర్ల: పొలం విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడి పోలీసులకు ఫిర్యాదు చేశాయి. వివరాలు.. మండల పరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన మంటి రామాంజనేయులు, మహాలక్ష్మిపై అదే గ్రామానికి చెందిన మంటి మద్దిలేటి, మంటి శేక్షావలి, మంటి మాధవి, లద్దగిరి రాముడు, సురేంద్ర, సామక్క పొలం విషయంలో గొడవ పెట్టుకుని దాడి చేశారు. బాధితులు మంటి రామాంజనేయులు, మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అలాగే మంటి మాధవి ఫిర్యాదు మేరకు మరో వర్గంపై కౌంటర్ కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య శనివారం తెలిపారు.

ప్రవేశ పరీక్షలో ప్రతిభ



భవిష్య చౌదరి, కోమలి, గంగా భవాని

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం ప్రకృతి విద్యానికేతన్ విద్యార్థులు మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ రవికుమార్ రెడ్డి తెలిపారు. గత నెల 27వ తేదీ ప్రవేశ పరీక్ష జరిగిందన్నారు. తమ పాఠశాలకు చెందిన భవిష్య చౌదరి జిల్లాలో మొదటి ర్యాంక్, కోమలి నాల్గో ర్యాంక్, గంగాభవాని 6వ ర్యాంక్, యోగేంద్ర చౌదరి 16వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు ఉపాధ్యాయులు మంజుల, భాగ్యవతి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చాగలమర్రి: మండలంలోని రాంపల్లె మెట్ట వద్ద జాతీయ రహదారిపై మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడటంతో పెద్ద బోధనం గ్రామానికి చెందిన గద్ద సుబ్బారాయుడు(31) మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెద్ద బోధనం గ్రామానికి చెందిన గద్ద సుబ్బారాయుడు ప్రతి రోజు లాగే కొలిమి పని చేయడానికి మోటార్ సైకిల్‌పై ఆళ్లగడ్డకు బయలుదేరాడు. రాంపల్లె మెట్ట వద్దకు వెళ్లడానికి కుడి వైపు నుంచి ఎడమ వైపుకు వెళ్లే క్రమంలో మోటారు సైకిల్ అదుపు తప్పి కిందపడటంతో సుబ్బారాయుడు తలకు గాయమైంది. గ్రామస్తులు టోల్ ప్లాజాకు చెందిన అంబులెన్సులో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ షేక్ అబ్దుల్ నబి తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు సంతానం.

మాన్యం భూములకు పెరిగిన ఆదాయం

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో నిర్వహించిన మాన్యం భూముల కౌలువేలం పాటల్లో ఆలయానికి ఆదాయం పెరిగినట్లు ఈఓ బాల చెంచన్న తెలిపారు. శనివారం గ్రామంలోని శ్రీగౌరిభోగేశ్వర స్వామి ఆలయాని చెందిన 46 ఎకరాలు, శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ 44.14 ఎకరాల మాన్యం భూముల కౌలుకు వేలం పాట నిర్వహించగా రూ.22.12లక్షలకు రైతులు దక్కించుకున్నారన్నారు. గతేడాది రూ. 20.14లక్షలకు పాడగా మొత్తం రూ.1.98 లక్షలు ఆదాయం పెరిగినట్లు చెప్పారు. డీసీ ఉపాధ్యక్షుడు వెంకటనాయుడు, గోపాల్ నాయుడు, మాజీ ఆలయ ధర్మకర్త నారాయణస్వామి, శేషప్ప, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు ఆరోగ్య భరోసా

- గత ప్రభుత్వ హయాంలో పశువ్యాధి నిర్ధారణ కేంద్రాల ఏర్పాటు
- సకాలంలో పశువులకు వైద్యం
- ఏటా వేలాది మూగజీవాల ప్రాణాలకు రక్ష



డోన్‌లోని పశువ్యాధి నిర్ధారణ కేంద్రం



వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న పశువైద్యులు

డోన్: రైతులకు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ జీవనాధారం. పశువుల్లో వచ్చే వ్యాధులను సకాలంలో గుర్తించి వైద్యం అందించకుంటే నష్టపోయే ప్రమాదం ఉంది. పాడి రైతుల సంక్షేమం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఓ పశువ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఫలితంగా మూగజీవాలకు సంక్రమించే అనేక అంతుబట్టని రోగాలను వైద్య పరీక్షల ద్వారా గుర్తిస్తున్నారు. సకాలంలో వైద్య చికిత్సలు అందించి వాటి ప్రాణాలను కాపాడుతున్నారు. పశువుల్లో వచ్చే వ్యాధులు, చికిత్స విధానం గురించి పశువైద్యుల మాటల్లోనే..

క్యాన్సర్

పశువుల్లో ముఖ్యంగా కొమ్ము, వరిబీజాలకు క్యాన్సర్ అధికంగా సోకుతుంది. ప్రాథమిక దశలో చిన్న పుండు మాదిరి శరీరంపై ఏర్పడి అనంతరం పెద్దదిగా మారి క్యాన్సర్‌గా రూపాంతరం చెందుతుంది. ఇలాంటి వాటిని సకాలంలో గుర్తించి వైద్య చికిత్స చేయిస్తే నివారణ సాధ్యమవుతుంది.

అర్లపొట్ట వ్యాధి

ముఖ్యంగా పట్టణాల్లో పశుగ్రాస కొరత కారణంగా పశువులు వీధుల్లో కనిపించే ప్లాస్టిక్ కవర్లు, అట్టలు లాంటి వ్యర్థ పదార్థాలను తిని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయి. ఆకలి తాళలేక అధిక మోతాదులో వ్యర్థపదార్థాలు తినడం వల్ల కడుపు ఉబ్బిపోతుంది. దీంతో పశువులు మేత మేయకపోవడం, నీళ్లు తాగకపోవడం జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సకాలంలో రైతులు పశువైద్యశాలలకు తరలిస్తే ఆపరేషన్ ద్వారా వ్యర్థ పదార్థాలను తొలగించి పశువుల ప్రాణాలను కాపాడే వీలు కలుగుతుంది. గర్భంతో ఉన్న పశువులకు జాగ్రత్తగా శస్త్రచికిత్సలు నిర్వహించి దూడలను సిజేరియన్ ద్వారా బయటకు తీయాల్సి వస్తుంది.

మూత్రాశయంలో రాళ్లు

మనుషుల మాదిరిగానే పశువుల్లో కూడా మూత్రాశయ వ్యాధులు అధికంగా కనిపిస్తాయి. సరైన మోతాదులో నీళ్లు తాగకపోవడం, అనేక వ్యర్థ పదార్థాలను అతిగా తినడం మూలంగా మూత్రాశయంలో సున్నపురాళ్లను పోలిన రాళ్లు సహజసిద్ధంగా ఏర్పడతాయి. ఇవి మూత్రాశయానికి అడ్డుగా ఉండడం వల్ల పశువులు సరైన మోతాదులో మూత్రం పోయలేక కడుపు ఉబ్బరంతో బాధపడుతుంటాయి. పశుపోషకులు ఇలాంటి పరిస్థితులను నిశితంగా పరిశీలించి సకాలంలో పశువైద్యశాలలకు తరలిస్తే మూత్రాశయంలో రాళ్లను శస్త్రచికిత్స ద్వారా తొలగించే అవకాశం కలుగుతుంది.



పశువుకు శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

అప్రమత్తత అవసరం



పశువుల్లో వ్యాధి నిర్ధారణ సత్వరం జరగాలంటే పడిరైతులు వాటిని నిరంతరం పరిశీలిస్తూ ఉండాలి. ఇప్పుడు నియోజకవర్గ కేంద్రంలోనే వ్యాధి నిర్ధారణ కేంద్రం అందుబాటులో ఉండడంతో సకాలంలో పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఫలితాలు రైతులకు అందించి వెంటనే వైద్య సేవలు అందిస్తున్నాం. వ్యాధి నిర్ధారణ కేంద్రాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ నాగరాజు, పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు, డోన్

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలి



ఆర్ఐకి వినతి పత్రం ఇస్తున్న హ్యూమన్ రైట్ సంస్థ సభ్యులు

కొలిమిగుండ్ల: బందార్లపల్లె క్రాస్ రోడ్డు సమీపంలో భూగర్భ గనుల శాఖ ఏర్పాటు చేసిన రాయల్టీ చెక్‌పోస్టు వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ సభ్యుడు కంబగిరిస్వామి పేర్కొన్నారు. శనివారం సంస్థ సభ్యులతో కలిసి చెక్‌పోస్టు ఆర్ఐ ప్రభుదాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కొలిమిగుండ్ల, అవుకు మండలాల నుంచి నాపరాళ్ల రవాణ చేసే ట్రాక్టర్లు, లారీలు చెక్‌పోస్ట్ వద్ద ఆపి చెక్ చేయించుకునే సమయంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. వాహనాలు రోడ్డుపైనే ఆపడం వల్ల ఇతరుల వాహనాలు, అంబులెన్సలకు అసౌకర్యంగా మారుతుందన్నారు. నాపరాళ్ల వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయకుండా చేయాలని కోరారు.

ప్రజలపై పన్నుల భారం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ కుమార్

డోన్ టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మరిచి ప్రజలపై పన్నుల భారం మోపడం తగదని సీపీఎం నంద్యాల జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణాల్లో 20 శాతం ఇంటి పన్ను పెంచుతూ గుట్టుచప్పుడు కాకుండా జీఓ విడుదల చేయడం కూటమి ప్రభుత్వ మోసానికి నిదర్శనం అన్నారు. దీని కారణంగా ప్రజలపై రూ. 420 కోట్ల అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి తలొగ్గి ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని ప్రవేశపెట్టి చట్ట సవరణ ద్వారా జీఓ విడుదల చేసిందన్నారు. ఐదేళ్ల కాలంలో వంద శాతం అదనపు భారం ప్రజలపై పడుతుందన్నారు. ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా, పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించకుండా ఇలా పన్నులు పెంచడం సరి కాదన్నారు. జీఓను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు శివరామ్, కొండన్న, భాస్కర్‌రెడ్డి, నాగమద్దయ్య, చిన్న రహిమాన్, ధనుంజయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

• పచ్చందం



సంజామలలో పచ్చదనంగా మారిన పొలం

వేసవిలో కురుస్తున్న వర్షాలకు పచ్చదనం కనువిందు చేస్తోంది. ఈ ఎడాదిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నా మందస్తు వర్షాలతో బీడు భూములు పచ్చగా చిగురించాయి. కోవెలకుంట్ల–అవుకు ప్రధాన రహదారిలో ఇరువైపులా చెట్లు, గడ్డి పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. సంజామల సమీపంలో వరిమళ్లు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. –సంజామల

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



నందీశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితులు

మహానంది: స్థానిక మహానందీశ్వరస్వామి గర్భాలయానికి ఎదురుగా ఉన్న నందీశ్వర స్వామికి శనివారం అభిషేకం పూజలు నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని, ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ప్రదోష కాలంలో నందీశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, అభిషేకార్చనలు చేశారు. గంధాభిషేకం, పాలాభిషేకం చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు ఆర్జితసేవా టికెట్ల ద్వారా ప్రదోష కాల అభిషేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే శనివారం వీకెండ్ సందర్భంగా భక్తులరద్దీ నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు కల్యాణం నిర్వహించారు. రాత్రి యాగశాలలో మహానందీశ్వరుడి దంపతులకు ఏకాంత సేవ పూజలు చేపట్టారు.

• కారు మబ్బులు



ఆకాశంలో కమ్ముకున్న కారు మబ్బులు

నైరుతి రుతుపవనాల సమయం ఆసన్నం కావడంతో ఆకాశంలో మార్పులు చోటు చేసుకున్నాయి. శనివారం కొలిమిగుండ్లలో ఆకాశం కారు మబ్బులు కమ్ముకున్నాయి. కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంపై కారు మబ్బులు కమ్ముకోవడంతో ఆ దృశ్యాలు చూపురులను ఆకట్టుకున్నాయి. కొండ వెనుక భాగంలో ఇంద్రధనస్సు ఏర్పడింది. మే నెలలో అనూహ్యంగా వర్షాలు కురవడంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు పూర్తిగా తగ్గిపోయాయి. చెరువులు వెలవెలబోవడంతో తాగు,సాగు నీటి బోర్లలో నీళ్లు ఇంకిపోయాయి. ఈ ఏడాడి రుతుపవనాలు ముందస్తుగా రానుండడంతో భారీ వర్షాలు కురుస్తాయని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. –కొలిమిగుండ్ల

ఉచిత శిక్షణ

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో ఉచితంగా సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లలిత శనివారం తెలిపారు. ఏదైన డిగ్రీ లేదా బి.టెక్ చదివిన అభ్యర్థులు కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు tinyuri.com/gdcbpl లింక్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 97059 98056 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని ఎస్కేపీ హైస్కూల్ వద్ద నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. పాతబస్టాండ్, రైల్వేస్టేషన్ రోడ్డు, షాదిఖానా, సుందర్ సింగ్‌కాలనీ, డీఎస్పీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

మారణహోమం ఆపాలి

కోవెలకుంట్ల: ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న మారణహోమాన్ని ఆపాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరీంబాషా, నాగభూషణం అన్నారు. శనివారం కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 27 మందిని ఎన్‌కౌంటర్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మారణహోమంపై సుప్రీంకోర్టు స్వతంత్ర న్యాయ కమిషన్ ఏర్పాటు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఎన్‌కౌంటర్లకు పాల్పడిన బాధ్యులపై 302 సెక్షన్ కింద కేసు నమోదు చేసి వీడియో రికార్డింగ్ ద్వారా బంధుమిత్రుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని కోరారు.

అనారోగ్యంతో పహిల్వాన్ మృతి



శంకర్‌రెడ్డి(ఫైల్)

కోవెలకుంట్ల: పట్టణంలో పహిల్వాన్‌గా గుర్తింపు పొందిన కామని శంకర్‌రెడ్డి(83) శనివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందారు. వాలీబాల్ క్రీడాకారుడిగా, ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్‌గా, రాతి గుండు ఎత్తే పహిల్వాన్‌గా ఈయనకు పేరుంది. యుక్త వయసులో ఏటా పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో రాతిగుండు ఎత్తే పోటీల్లో పాల్గొని ప్రతిసారిగా విజయం సాధించి పహిల్వాన్‌గా గుర్తింపు పొందారు. పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజా సంఘాల నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఆన్‌లైన్ రుణ యాప్‌లను నిషేధించాలి

డోన్ టౌన్: ఆన్‌లైన్ రుణ యాప్‌ల వేధింపులతో రాష్ట్రంలో 3423 మంది చనిపోగా ఇందులో డోన్ తాలూకలో 32 మంది ఉన్నట్లు.. ఈ యాప్‌లను నిషేధించాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణ యాప్ ఒత్తిడితో అనేక కుటుంబాలు సతమతమవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రుణ యాప్‌లపై చర్యలు తీసుకుని బాధితులకు అండగా నిలవాలని కోరారు.

సిద్ధేశ్వరం అలుగు సాధనే లక్ష్యం

- భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న బొజ్జ దశరథరామిరెడ్డి

కోవెలకుంట్ల: రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీటి వనరు అయిన సిద్ధేశ్వరం అలుగు సాధనే లక్ష్యమని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి అన్నారు. ఈ నెల 31వ తేదీ నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభ వాల్‌పోస్టర్లను శనివారం పట్టణంలోని పరంధామ నిలయంలో విడుదల చేశారు. ఏపీ అంటే కేవలం అమరావతి, పోలవరమే కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇందు కోసం శ్రీశైలం జలాశయం నీటిని పూర్తిగా రాయలసీమకే వినియోగించాలని, కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని తెలిపారు. అమరావతిని ఫ్రీజోన్ చేసి యువత భవితకు విద్యాలయాలు, పరిశ్రమలు నెలకొల్పాలని, రాష్ట్ర విభజన చట్టంలోని ప్రత్యేక ప్యాకేజి, కడప ఉక్కు, జాతీయస్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైకోర్టు, వివిధ కార్పొరేషన్లు సీమలో ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. హంద్రీ–నీవా, తెలుగు గంగ, గాలేరునగరి, వెలుగొండ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిసారించాలని, రూ. 1,500 కోట్లతో వచ్చే ఖరీఫ్‌కు 10 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరణ, అలగనూరు, గోరుకల్లు రిజర్వాయర్ల మరమ్మతులు, పంటకాల్వల ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సిద్ధేశ్వరం వద్ద నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు రైతులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పొట్టిపాడులో పల్లె నరసింహారెడ్డితో కలిసి బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ప్రకృతిపీఠం ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, సభ్యులు ఏరాశి మహేశ్వరరెడ్డి, ఆవుల శివ, కేశవ, రైతు సంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర పథకాన్ని పక్కాగా అమలు చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల అభ్యున్నతికి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తి ఆభ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభయాన్–2025 పథకాన్ని పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను శనివారం ఓ ప్రకటనలో ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో నిర్వహించబడే ఈ కార్యక్రమంపై గిరిజనులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు జిల్లాలో విస్తృత ప్రచార అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ పథకం ద్వారా గిరిజన ప్రాంత సముదాయాల్లో సురక్షిత గృహనిర్మాణం, శుభ్రమైన తాగు నీరు, మెరుగైన పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, పోషకాహారానికి మెరుగైన ప్రాప్యత, విద్యుత్ సరఫరా, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగ ప్రచారం, రహదారి, టెలికాం కనెక్టివిటీ వంటి రంగాలపై విస్తృత పరిషత్ విస్తృత ప్రచారం కల్పిస్తూ సంబంధిత అంశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే.. జిల్లాలోని గిరిజనులకు ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్ మరియు జన్ ధన్ అకౌంట్లను తప్పనిసరిగా ఇప్పించాలన్నారు.

దాహం.. దాహం



వెంకటనాయునిపల్లెలో ట్యాంకు వద్ద నీటి కోసం రద్దీ



బిందెలతో ఎద్ల బండిపై వెళ్తున్న గ్రామస్తుడు



సైకిల్‌పై నీళ్లు తెస్తున్న బాలుడు

డోన్ మండలం వెంకటనాయునిపల్లె గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో మంచినీటి సమస్య రానివ్వకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. సమస్య నివారణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో దాహార్తితో ప్రజలు అలమటిస్తున్నారు. గ్రామానికి చెందిన పలువురు మంచినీటి కోసం ఎడ్లబండ్లు, సైకిళ్ల ద్వారా కిలోమీటర్ల దూరం వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. –డోన్

బదిలీల్లో భర్తీ అయ్యేనా..?

కొలిమిగుండ్ల: ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అధికారులు సిద్ధమవుతున్నారు. కొలిమిగుండ్లలో కీలకమైన విద్యుత్ శాఖ ఏఈ, వెలుగు ఏపీఎం పోస్టులు దాదాపు ఆరు నెలల నుంచి ఖాళీగా ఉన్నాయి. త్వరలో జరిగే బదిలీల్లో అయినా ఈ రెండు పోస్టులు భర్తీ జరుగుతుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏఈగా పని చేస్తున్న ప్రసన్న ఆంజనేయులు ఎమ్మిగనూరుకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో మరొకరిని నియమించలేదు. ప్రస్తుతం అవుకు ఏఈ ఫక్కీరయ్యకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ప్రతి నెలా గృహ, పరిశ్రమలు తదితర వాటి నుంచి ప్రతి నెలా రూ.2 కోట్లకు పైగానే బిల్లులు వసూలు చేయాల్సి ఉంటుంది. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తనున్నాయి. రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో సిబ్బంది పనితీరు అంతంత మాత్రంగానే ఉంటోంది. వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా పనిచేసే తిరుపాల్‌రెడ్డి నంద్యాలకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అవుకు ఏపీఎంకు ఇన్‌చార్జ్ అప్పగించారు. ఆయన అవుకు రెగ్యులర్‌తో పాటు కొలిమిగుండ్ల, బనగానపల్లె మండలాలకు ఇన్‌చార్జ్‌గా నియమించారు. బ్యాంక్ రుణాల మంజూరు, రికవరీలో పొదుపు మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. త్వరలో జరిగే బదిలీల్లో భర్తీ జరుగుతాయా లేదా అనేది త్వరలో తెలిసిపోనుంది.